# బైక్ స్కామ్ గుట్టు రట్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

- బీమాకంపెనీని మోసగించిననిందితులు
- తొమ్మిది మంది అరెస్టు.. 27 బైకులు స్వాధీనం
- ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి వెల్లడి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 19: ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైన బైకు స్కామ్ గుట్టు రట్టు చేశారు ఆర్మూర్ పోలీసులు. బైకులు చోరీకి గురయ్యాయనికి బీమా కంపెనీ నుంచి సొమ్ము చేసుకున్న కేసులో నిందితులను కటకటాల్లోకి పంపించారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి 27 బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం ఆర్మూర్ ఠాణాలో విలేకరులకు వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన షాహిద్ అలీ, అతడి స్నేహితుడు సయ్యద్ ఒమెన్ కలిసి ఇన్సూరెన్స్ కంపెనీకి ఎగనామం పెట్టాలని పథకం వేశారు. హైదరాబాద్‌లోని బైక్ షోరూంలలో సయ్యద్ ఒమెన్ డౌన్ పేమెంట్ కట్టి బైకులు కొనేవాడు. మిగతా సొమ్మును హీరో ఫిన్ కార్ప్ లిమిటెడ్ నుంచి లోన్ తీసుకుని హీరో కంపెనీకి చెందిన ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసేవాడు. ఒకటి, రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత బైకులను ఇతర ప్రాంతాలకు తరలించేవారు. ఆ తర్వాత తమ వాహనాలు చోరీకి గురయ్యాయని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసేవారు. ఆయా ఎఫ్ఐఆర్ కాపీలను ఇన్సూరెన్స్ కంపెనీకి అందజేసి, సదరు వాహనాలకు బీమా డబ్బులు పొందేవారు. మాయం చేసిన బైకులను హైదరాబాద్‌కు చెందిన సబీర్ ఖాన్ ద్వారా కామారెడ్డి వాసి మహ్మద్ యాసిన్‌కు పంపేవారు. అతడు వాటిని ఆర్మూర్ మండలం మిర్దాపల్లికి చెందిన కల్లెం యోగేశ్‌రెడ్డి, రాంపూర్‌కు చెందిన బంటు ప్రశాంత్, అంకాపూర్‌కు చెందిన కుమ్మల వెంకట్‌రెడ్డి, సిరికొండ మండలం హుస్సేన్‌సాగర్‌కు చెందిన తేనేటి నరేశ్, ధర్పల్లికి మండలం మైలారం గ్రామానికి చెందిన కాటిపల్లి శ్రీకాంత్‌కు చేరవేసేవాడు. వీరు ఆయా బైకులను ఆర్మూర్, డొంకేశ్వర్, సిరికొండ, ధర్పల్లి, మాక్లూర్ మండలాల్లో విక్రయించే వారు. ఇలా అమ్మినందుకు ఒక్కొక్కరికీ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు, ఏజెంట్లుగా వ్యవహరించిన వారికి రూ.2 వేలు కమీషన్ చెల్లించేవారు. అయితే, తాము ఫైనాన్స్ ఇచ్చిన బైకులు తరచూ చోరీకి గురవుతుండడంతో అనుమానం వచ్చిన హైదరాబాద్‌కు చెందిన బీమా సంస్థ ఫిన్‌కార్ప్స్ లిమిటెడ్ సేల్స్‌మేనేజర్ అబ్దుల్ రఫీ ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బైకుల స్కామ్‌ను వెలుగులోకి తీసుకొచ్చారు.







తెలంగాణ భవన్‌లో సమావేశ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్







పాల్గొన్న బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్



సమావేశంలో పాల్గొన్న ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ షిండే

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్ రాజు, దాదన్నగారి విఠల్‌రావు



# బీఆర్ఎస్‌లో జోష్

- బాస్ ఈజ్ బ్యాక్
- తెలంగాణ భవన్‌లో విస్తృతస్థాయి సమావేశం
- గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేసీఆర్

తెలంగాణభవన్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీ మాజీచైర్మన్లు దఫేదార్ రాజు, విఠల్‌రావు, కామారెడ్డి బీఆర్ఎస్ అధ్యక్షుడు ముజీబుద్దీన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో, ఆ తర్వాత బంగారు తెలంగాణ నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రాముఖ్యతను గుర్తుచేశారు. తెలంగాణ రాజకీయ అస్తిత్వపార్టీగా, రాష్ట్రాన్ని సాధించి తన చారిత్రక బాధ్యతను నిర్వహించిన వైనాన్ని వివరించారు. గతం గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను తిరిగి అవే కష్టాల పాలు కాకుండా, గత దోపిడీ వలసవాదుల బారిన పడకుండా గులాబీ శ్రేణులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పటిష్ట నిర్మాణం చేసి అటు బీఆర్ఎస్, ఇటు తెలంగాణ ప్రజల శాశ్వత విజయం కోసం సమాంతరంగా పని చేయాలని సూచించారు.

# నిజామాబాద్ మార్కెట్‌యార్డులో డీపీసీ ప్రారంభం

పసుపు రైతుల ఆందోళనకు దిగొచ్చిన అధికారులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 19: పసుపు రైతుల ఆందోళన మార్కెటింగ్ అధికారుల్లో చలనం తెప్పించింది. నిజామాబాద్ మార్కెట్ యార్డులో డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్ (డీపీసీ) ప్రారంభమైంది. వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు, పాలకవర్గం కుమ్మక్కై గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారని, కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తున్నారని పసుపు రైతులు మంగళవారం ధర్నా చేపట్టిన సంగతి తెలిసిందే. పసుపు కొనుగోళ్లు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులను నిలదీసిన విషయం విదితమే. కర్షకుల ధర్నా నేపథ్యంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ హుటాహుటిన స్పందించింది. బుధవారం మార్కెట్ యార్డులో డీపీసీని ప్రారంభించారు. రైతులు పసుపు కొమ్ములను బాగా ఎండబెట్టి, చెత్తాచెదారం లేకుండా తీసుకొస్తే ఎలాంటి కమీషన్ లేకుండా నేరుగా రైతు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని మార్కెటింగ్ అధికారులు తెలిపారు. మరోవైపు, ఆందోళనలకు దిగితే తప్ప మార్కెట్ యార్డులో ఏ పని జరగదని రైతులు పేర్కొన్నారు.

# మున్సిపల్ కార్మికుల ధర్నా



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- లేకపోతే మార్చి 1 నుంచి ఆందోళనలు

కామారెడ్డి, ఫిబ్రవరి 19: సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు బుధవారం కామారెడ్డి బల్దియాను ముట్టడించారు. మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని వారు వాపోయారు. అలాగే, ఐదు నెలల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ నిధులు జమ చేయడం లేదన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అధికారులు వేధింపులు మానుకోవాలని, మున్సిపల్ కార్మికుల హాజరు పాయింట్లు రెండు చోట్లనే పెట్టాలని కోరారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ బడ్జెట్‌లో మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ పెట్టాలన్నారు. కనీసం వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే మార్చి 1 నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు వచ్చి మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, కార్యదర్శి మహిబూబ్, ప్రతినిధులు వెంకట్‌గౌడ్, అరున్, ప్రభు, దీవెన, భూలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులను తోడేస్తున్నారు..

- రెచ్చిపోతున్న కాంట్రాక్టర్లు
- ప్రజాపనుల పేరిట అనుమతులు
- ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- ప్రభుత్వ నిబంధనలకు తూట్లు
- సర్కార్ ఆదాయానికి గండి

**మండలంలో** కొంతకాలంగా మొరం దందాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. వేలం ద్వారా ప్రజా పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు అక్రమ క్వారీలు నిర్వహిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు.నామ్ కే వస్తేగా అనుమతులు పొంది జేసీబీలు, టిప్పర్లతో మొరం, కంకరను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీ మొత్తంలో గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైన్స్, పోలీస్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. –నవీపేట, ఫిబ్రవరి 19



ఫకీరాబాద్ శివారులో రోడ్డు వేస్తున్న పొక్లెయినర్

## మొరం తవ్వకాలపై అధికారులు స్పందించాలి

నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులో మొరం తవ్వకాలు చేపడుతున్న సదరు కాంట్రక్టర్ పై కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఫత్తేనగర్, నవీపేట మైసమ్మ చెరువు కుంటలపై ఉన్న రోడ్డు మార్గం గుండా 200 మందికి పైగా విద్యార్థులు స్కూల్ బస్సుల్లో వెళ్తుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో అదుపు తప్పి చెరువు గుంతలో పడితే పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆయా చెరువుల్లో మొరం తవ్వకాలు నిలిపివేయాలని, సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఫత్తేనగర్ చెరువులో మొరం తవ్వకాలు



మొరం తవ్వడంతో ఫకీరాబాద్ శివారులో ఏర్పడిన భారీ గుంత

**నవీపేట** మండల పరిధిలోని డబుల్ రైల్వే లైన్ నిర్మాణంతోపాటు నేషనల్ హైవే నిర్మాణ పనులను కొందరు కాంట్రాక్టర్లు వేలం ద్వారా దక్కించుకున్నారు. వీటి నిర్మాణానికి గాను మొరం, కంకరకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా గనులశాఖ నుంచి అనుమతులు పొంది నిబంధనలకు తూట్లు పొడుస్తూ మొరం అక్రమ తవ్వకాలకు తెరలేపారు. రైల్వే డబుల్ పట్టాల నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ నుంచి మండల పరిధిలోని ఫత్తేనగర్, నవీపేట, ఫకీరాబాద్, నాగేపూర్, మైసమ్మ చెరువులో మూడు ఫీట్ల మొరం తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారు. ఉన్నతాధికారులను మచ్చిక చేసుకున్న సదరు కాంట్రాక్టర్ నిబంధనలకు వ్యతిరేకంగా రాత్రింబవళ్లు చెరువులో వంద ఫీట్లలోతుకుపైగా జేసీబీతో తవ్వకాలు చేపడుతున్నాడు. మూడు ఫీట్ల లోతు తవ్వకాలు చేస్తానని అనుమతి పొందిన సదరు కాంట్రాక్టర్, ఏకంగా 100 ఫీట్ల లోతు వరకు మొరం తవ్వకాలు చేపట్టడంతో ఆ ప్రదేశం మినీ ప్రాజెక్టును తలపిస్తున్నది. 70 రోజులుగా ఫత్తేనగర్ చెరువు కుంటలో ప్రతిరోజూ రాత్రి పగలు తేడాలేకుండా జేసీబీలతో తవ్వకాలు చేపట్టి మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

### తూములకు నీరు అందడం కష్టమే..

నవీపేట మైసమ్మ కుంట ఫత్తేనగర్ చెరువుల్లో భారీ ఎత్తున మొరం తవ్వకాలు చేపడుతుండడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో చెరువులో నీరు తూముల ద్వారా పంట పొలాలకు అందడం కష్టంగా మారనున్నదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చెరువులో మూడు ఫీట్ల వరకు తవ్వకాలకు అనుమతి ఇస్తే, వంద ఫీట్ల లోతు వరకు తవ్వకాలు ఎందుకు చేపడున్నారని ప్రశ్నిస్తున్నారు. చెరువుల లోతును ఆధారంగా తీసుకొని గతంలో తూముల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం మొరం తవ్వకాలతో 100 ఫీట్లకు పైగా లోతు తీయడం రైతులకు సాగు నీరు అందకపోగా, మోటర్ల ద్వారా భారీ తవ్వకాలతో భూగర్భ జలాలు గుంతల్లోకి చేరుకోవడంతో బోర్లు ఎత్తిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మొరం అక్రమ రవాణాపై దాట వేసిన తహసీల్దార్

మొరం దాందాపై స్థానిక తహసీల్దార్ వెంకటరమణ దాట వేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ వెంకటరమణతో మొరం అక్రమ రవాణాపై మాట్లాడగా రైల్వే పనుల నిమిత్తం వాడే మొరం గనుల శాఖ ఏడీ అనుమతి ఇస్తుందని, తన పరిధిలో లేదని పేర్కొనడం గమనార్హం. మొరం దందాపై ఆయన వద్ద సమాచారం ఉన్నా తనకు తెలియదని తప్పించుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని పలువురు చర్చించుకుంటున్నారు.



ఫత్తేనగర్ సమీపంలోని చెరువు కుంటలో మొరం తవ్వకాలు

### మూడు ఫీట్లకు మాత్రమే అనుమతిఇచ్చాం

రైల్వే పనుల నిమిత్తం సంబంధిత కాంట్రక్టర్ దరఖాస్తు చేసుకుంటే గ్రామాల్లోని పలు చెరువుల్లో మొరం తవ్వకాలకు మూడు ఫీట్ల లోతు వరకే అనుమతి ఇచ్చాం. కానీ చెరువుల్లో పెద్ద ఎత్తున లోతుగా మొరం తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆయా గ్రామాల ప్రజలు రైతుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటాం.

**-బాల్‌రాం, ఈఈ ఇరిగేషన్ బోధన్..**

### మొరం, కంకరకు అనుమతులు ఇచ్చాం

రైల్వే, హైవే రోడ్డు నిర్మాణ పనుల కోసం మొరం, కంకర తీసుకునేందుకు అనుమతులు ఇచ్చాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిని బట్టి టన్నుల ప్రకారం రాయల్టీ కట్టించుకొని పర్మిషన్ ఇచ్చాం. తీసుకున్న అనుమతి కన్నా అదనంగా మొరం తరలిస్తున్నట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం.

**-విజయ్‌కుమార్ రాథోడ్, మైనింగ్ శాఖ ఏడీ నిజామాబాద్**

### కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ చూపాలి..



మొరం అక్రమ రవాణా నియంత్రణపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలి. నవీపేట మండల పరిధిలోని ప్రజాపనుల పేరిట మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా అనుమతులు పొంది ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు స్పందించి మొరం దందాను అరికట్టాలి.

**-వి.నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నవీపేట మండల అధ్యక్షుడు**

# సంపన్నులకు అనుకూలంగా కేంద్రబడ్జెట్

- వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా, నిరసన
- బోధన్‌లో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నిజామాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీ నాయకులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 19 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు అనుకూలంగా ఉన్నదని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఎస్టీ చెల్లిస్తున్న మధ్యతరగతి ప్రజలకు, వ్యవసాయ రంగానికి, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ఉందని, నామమాత్ర కేటాయింపులే ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. బోధన్-బీదర్ రైల్వేమార్గం ఊసే లేదని, పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదని, తెలంగాణ విభజన హామీ కేటాయింపులు లేవని, బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పి.సుధాకర్, రమేశ్‌బాబు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, వనమాల కృష్ణ, ఖాజా, గంగాధర్, రాజేశ్వర్, రాజయ్య, పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, సుధాకర్, వెంకన్న, సాయన్న, గంగాధర్ పాల్గొన్నారు.